సాక్షి
ఆదిలాబాద్
సోమవారం, 5, ఫిబ్రవరి, 2024



నాగోబా జాతరకు సన్నద్ధం

నాగోబా జాతర సమీపిస్తుండడంతో ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. 8లో▸



ప్రశాంతంగా సీవోఈ సెట్

తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదివారం నిర్వహించిన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ) కామన్ ఎంట్రెన్స్ టెస్ట్–2024 ప్రశాంతంగా ముగిసింది. 8లో▸

గరిష్టం/కనిష్టం
34.0/21.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. వేకువజామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయ హక్కుల కోసం ఎస్టీయూ నిరంతర పోరాటం

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం ఎస్టీయూ నిరంతరం పోరాటాలు చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, అశోక్‌కుమార్ అన్నారు. ఎస్టీయూ వ్యవస్థాపకుడు మొహియుద్దీన్ జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఆదివారం నిర్వహించారు. మొహియుద్దీన్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మొహియుద్దీన్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయ బదిలీ, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు విలాస్, పోచారెడ్డి, కబీర్‌దాస్, ముఖీమ్, జాని తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జిగా చరణ్‌గౌడ్



చరణ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్‌గౌడ్‌ను ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీగా నియమించారు. ఈ మేరకు యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సామ రూపేష్‌రెడ్డి, శ్రీధర్, ఆనంద్‌రావు, మల్లయ్య తదితరులున్నారు.

తహసీల్దార్ల సంఘం ఉమ్మడి జిల్లా కార్యవర్గం

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తహసీల్దార్ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. విద్యుత్ తరంగిణి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి, తహసీల్దార్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా వర్ణ, అసోసియేట్ అధ్యక్షులుగా భోజన్న, శ్యాంసుందర్, ఉపాధ్యక్షులుగా సుభాష్ చందర్, శ్రీనివాస్, నలందప్రియా, కోశాధికారిగా ఇమ్రాన్‌ఖాన్, ప్రచార కార్యదర్శిగా దిలీప్‌కుమార్, కార్యదర్శులుగా తుకారాం, సంతోష్‌రెడ్డి, శ్రీనివాసరావు, లక్ష్మి, వేణుగోపాల్ ఎన్నికయ్యారు.

సేవాభావానికి ప్రతీక ఎన్‌సీసీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్: దేశభక్తి, సేవాభావానికి ఎన్‌సీసీ కేడెట్లు ప్రతీకగా నిలుస్తారని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లకు జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ఆదివారం బి–సర్టిఫికెట్ పరీక్ష నిర్వహించగా 240 మంది హాజరయ్యారు. పరేడ్‌కు ముందు విద్యార్థులకు ఎమ్మెల్యే మార్గనిర్దేశం చేశారు. ఇందులో సీనియర్ ఆఫీసర్ అనిల్, ఎన్‌సీసీ అధికారి అఖిల్, కమాండ్ ఆఫీసర్, కేడెట్లు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

చాపకింద నీరులా.. కుష్ఠు

- తగ్గుముఖం పట్టని వ్యాధి
- జిల్లాలో ప్రస్తుతం 65 మంది వ్యాధిగ్రస్తులు
- ఈనెల 13 వరకు పక్షోత్సవాలు
- వైద్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన

జిల్లాలో వ్యాధిగ్రస్తుల వివరాలు..

సంవత్సరం	గుర్తించిన వ్యాధిగ్రస్తులు
2019–20	84
2020–21	41
2021–22	58
2022–23	62
2023–24	65 (ఇప్పటివరకు)



శరీరంపై స్పర్శలేని మచ్చలు (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో కుష్ఠు వ్యాధి చాపకింద నీరులా వ్యాప్తి చెందుతోంది. అంటువ్యాధి కావడంతో ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తోంది. సకాలంలో నిర్ధారించకపోవడంతో బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ప్రభుత్వం వ్యాధి నివారణకు చర్యలు చేపడుతున్నప్పటికీ ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకోకపోవడంతో నయం కావడం లేదు. వ్యాధి ముదిరిన తర్వాత చికిత్స పొందడంతో అంగవైకల్యం బారిన పడుతున్నారు. గతనెల 31 నుంచి ఈనెల 13 వరకు వైద్య శాఖ ఆధ్వర్యంలో పక్షోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వ్యాధిగ్రస్తులను గుర్తించడంతో పాటు కళాశాలలు, పాఠశాలలు, గ్రామాల్లో వైద్యసిబ్బంది అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

విస్తరిస్తున్న వ్యాధి..

కుష్ఠు రోజురోజుకు విస్తరిస్తోంది. ఆరు నెలల్లోపు వ్యాధిగ్రస్తులను గుర్తిస్తే చికిత్స ద్వారా పూర్తిగా నయం చేసే అవకాశాలు ఉంటాయి. జిల్లాలో ప్రస్తుతం 65 మంది బాధితులు ఉన్నారు. 10వేల జనాభాకు ఒకరికంటే ఎక్కువగా ఉంటే వ్యాధి తీవ్రత ఉన్నట్లు వైద్య శాఖ గుర్తిస్తుంది. జిల్లాలో ప్రస్తుతం 0.79గా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. రిమ్స్‌తో పాటు ఆయా పీహెచ్‌సీల్లో స్పర్శ లేని మచ్చల ద్వారా వ్యాధి నిర్ధారణ చేస్తున్నారు. శరీరంపైన పాలిపోయిన, రాగి రంగు గల మొద్దుబారిన మచ్చలు ఉన్నట్లయితే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే లక్షణాలు ఉన్నా చాలామంది ముందుకు రావడం లేదు. వ్యాధి ముదిరిన తర్వాత వైద్య పరీక్షలు చేయించడంతో అంగవైకల్యం ఏర్పడి ఇబ్బందులకు గురవుతున్నారు. ఇది అంటు వ్యాధి. ముందుగా చికిత్స పొందకపోవడంతో రోగి నుంచి వారి కుటుంబ సభ్యులకు సోకే ప్రమాదం లేకపోలేదు. సకాలంలో చికిత్స పొందితే వ్యాధి నయం అవుతుందని వైద్యులు సూచిస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా అంకోలి పీహెచ్‌సీలో 13 మంది, బజార్‌హత్నూర్‌లో 5, నేరడిగొండలో 4, తాంసిలో 4, తలమడుగులో 4, బేలలో 5, ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షీద్‌నగర్ పీహెచ్‌సీలో నలుగురు వ్యాధిగ్రస్తులు ఉన్నారు. జిల్లా కేంద్రంలోని అర్బన్ పీహెచ్‌సీలో కలిపి మొత్తం 10 మంది కుష్ఠుబారిన పడగా, జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 55 మంది ఉన్నారు.

కొనసాగుతున్న పక్షోత్సవాలు

వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గత నెల 31 నుంచి ప్రారంభమైన కుష్ఠు పక్షోత్సవాలు ఈనెల 13 వరకు కొనసాగనున్నాయి. ఇందులో భాగంగా వైద్య సిబ్బంది వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. లక్షణాలు ఉన్నవారు పరీక్షలు చేయించుకోవాలని, జాప్యం చేస్తే వైకల్యం ఏర్పడుతుందని పేర్కొంటున్నారు. పక్షోత్సవాల సందర్భంగా ఇప్పటి వరకు నలుగురు వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

సకాలంలో చికిత్స పొందితే..

శరీరంలోని అన్ని అవయవాలకు ఈ వ్యాధి సోకుతుంది. మైకో బ్యాక్టీరియా లెప్రే అనే బ్యాక్టీరియాతో వస్తుంది. సరైన సమయంలో వైద్యం చేయించుకోకపోతే రోగి ద్వారా ఇతరులకు వ్యాప్తి చెందుతుంది. వ్యాధి సోకిన తర్వాత 3–15 సంవత్సరాల తర్వాత దుష్పరిణామాలు బయట పడుతాయి. తొలి దశలో నిర్ధారించుకొని ఎండీటీ చికిత్స పొందితే అంగవైకల్యం రాకుండా కాపాడవచ్చు. శరీరంలో ఎరుపు రంగు, రాగి రంగు స్పర్శ లేని మచ్చలు ఉంటే వ్యాధిగా గుర్తించవచ్చు. జిల్లాలో ప్రస్తుతం చికిత్స పొందుతున్న వారు 65 మంది ఉండగా, పాత వ్యాధిగ్రస్తులు, అంగవైకల్యం కలిగిన వారు 300 మంది వరకు ఉన్నారు.

ప్రాథమిక దశలోనే గుర్తిస్తే మేలు..

కుష్ఠును ప్రాథమిక దశలోనే గుర్తిస్తే అది పూర్తిగా నయం అయ్యేలా చికిత్స అందించే వీలుంటుంది. జిల్లాలో 10వేల మంది జనాభాకు గాను 0.9గా ఉంది. ఇది ఒకటి దాటితే వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు పరిగణిస్తారు. జిల్లాలో ప్రస్తుతం 65 మంది వ్యాధిగ్రస్తులు ఉన్నారు. వారందరికీ చికిత్స అందిస్తున్నాం. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. శరీరంపై ఎవరికైనా గోదుమ రంగుతో పోలిన స్పర్శలేని మచ్చలు ఉంటే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలి. నిర్ధారణ అయితే చికిత్స అందిస్తారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

మా నిధులు మాక్కావాలి..



గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదిలాబాద్ పట్టణాభివృద్ధి కోసం రూ. 50 కోట్ల నిధులు విడుదల చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని నిలిపివేయడం సరికాదని న్యూహౌసింగ్‌బోర్డు కాలనీవాసులు ఆరోపించారు. మా నిధులు మాకు కావాలంటూ కాలనీలోని ప్రధాన రోడ్డులో హోర్డింగ్ ఏర్పాటు చేసి దాని ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న ఆదిలాబాద్ పట్టణానికి నిధులను నిలిపివేయడం సరికాదన్నారు. ఆ నిధులు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు. – కైలాస్‌నగర్

క్రీడలతో మానసికోల్లాసం



బ్యాటింగ్ చేసి మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌రూరల్: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు ఏకాగ్రత పెంపొందిస్తాయని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణ శివారు బెల్లూరి క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన న్యాయవాదులు, జైలు సిబ్బంది స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్‌ను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. స్నేహపూర్వక పోటీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ అశోక్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, జైలు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

‘గ్రామీణ బంద్’ జయప్రదం చేయండి



అభివాదం చేస్తున్న కార్మిక, రైతు సంఘాల నాయకులు

ఎదులాపురం: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న కేంద్ర కార్మిక, రైతు సంఘాలు నిర్వహించ తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మె గ్రామీణ బంద్ జయప్రదం చేయాలని కార్మిక, కర్షక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ హోమ్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా సదస్సులో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేళ్లవుతున్నా కార్మికులు, రైతులకు చేసింది శూన్యమన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. సదస్సులో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్, ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆశన్న,కిరణ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కుంటాల రాములు, ప్రధాన కార్యదర్శి దేవేందర్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్, గౌరవాధ్యక్షుడు నారాయణ, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు దేవదాస్‌చారి, ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవిదాస్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వెంకట్ నారాయణ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నన్న, సహాయ కార్యదర్శి దేవిదాస్, నాయకులు వెంకటమ్మ, శోభ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజాగ్రహానికి గురికాక తప్పదు’

ఆదిలాబాద్: ప్రజా సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్ అన్నారు. ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వే లైన్ నిర్మాణ పనులు ఆదిలాబాద్ నుంచి ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ సాధన కమిటీ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే దీక్షలు 20వ రోజుకు చేరాయి. ఆదివారం దీక్షలో సాధన కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారాయణ యాదవ్, నిమ్మల నరేందర్ తదితరులు కూర్చున్నారు. వీరికి శ్రీనివాస్‌తో పాటు పలువురు సంఘీభావం ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపులో ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం జరిగిందని ఆయన ఆరోపించారు. ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ ఏర్పడితే జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలి



హాకీ క్రీడాకారులతో గోవర్ధన్ రెడ్డి

ఆదిలాబాద్: జిల్లాలోని హాకీ క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలని ఆదిలాబాద్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. జిల్లాకు ఖేలో ఇండియా సెంటర్ రావడం అభినందనీయమన్నారు. పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఖేలో ఇండియా సెంటర్‌లో హాకీ శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు హాకీ స్టిక్స్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లా క్రీడాకారుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. క్రీడాకారులు ఆయా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ ఉన్నతంగా రాణించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అభివద్ధి అధికారి పార్థసారథి, హాకీ కోచ్ శ్రీనివాస్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు



ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



జాతరలో రంగులరాట్నం వద్ద సందడి

భక్తజన సందడిగా ‘ఖండేవ్’

గత నెల 25న తొడసం వంశస్తుల మహాపూజతో ప్రారంభమైన ఖండేవ్ జాతర ఆదివారం సందడిగా మారింది. సెలవు దినం కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం జాతర స్పెషల్ జిలేబి తిని ఆస్వాదించారు. జాతర కమిటీ ఆధ్వర్యంలో క్రికెట్, వాలీబాల్, కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈనెల 8 వరకు జాతర కొనసాగనుంది. – నార్నూర్



కుస్తీ పోటీలో తలపడుతున్న మల్లయోధులు

ఫస్ట్ టాస్క్ ఫలించేనా..!

- 7 నుంచి గ్రామాల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్
- పంచాయతీల్లో వేధిస్తున్న నిధుల కొరత
- ప్రత్యేకాధికారులకూ పాలన కొత్తగానే..
- సమన్వయంపైనే సందేహాలు

జిల్లాలో..

మండలాలు	17
గ్రామ పంచాయతీలు	468
ప్రత్యేకాధికారులు	123



భీంపూర్ మండలం కరంజి గ్రామంలో పల్లెప్రగతిలో భాగంగా రోడ్లు శుభ్రం చేస్తున్న గ్రామస్తులు (ఫైల్)

కైలాస్‌నగర్: గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల పదవీకాలం ఇటీవల ముగిసింది. ఈ నెల 2నుంచి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వారికి ఫస్ట్ టాస్క్‌ను నిర్దేశించింది. ఈనెల 7 నుంచి 15వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించింది. కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా అధికారులు కార్యాచరణ సిద్ధం చేస్తుండగా నిధుల కేటాయింపుపై ప్రభుత్వం నుంచి స్పష్టత కరువవడం గమనార్హం.

సర్కారు ముద్రవేసేలా...

గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లె ప్రగతి పేరిట ఏటా జూన్, జూలై నెలల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించేది. ఇందుకోసం ముందుగానే గ్రామాలకు ప్రత్యేక నిధులు విడుదల చేసేది. గత సర్కారు మాదిరిగానే పల్లె పాలనపై తమదైన ముద్ర వేయాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు, పంచాయతీ అధికారులు, ప్రత్యేకాధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క పల్లె ప్రగతి కోసం వారం రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్దేశించారు. ఈ నెల 7నుంచి 15వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలు, మహిళా సంఘాల సభ్యులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణతో పాటు గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లు, ఓవర్ హెడ్ ట్యాంక్‌లను శుభ్రం చేయాలని, అలాగే ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఇంత వరకు భాగానే ఉన్నా ఈ ప్రత్యేక కార్యక్రమానికి ప్రభుత్వ పరంగా ఎలాంటి నిధులను కేటాయించలేదు. ఇదే ఇప్పుడు అసలు సమస్యగా మారింది.

నిధుల్లేక నీరసం..

జిల్లాలో ఉన్న పంచాయతీలన్నీ నిధులలేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. గతంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి మాజీ సర్పంచులకు ఇప్పటిదాకా బిల్లుల చెల్లింపు పూర్తికాలేదు. రూ.5 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నట్లుగా అధికారులు చెబుతున్నారు. ఈ బిల్లులు పొందకుండానే తమ పదవీ కాలం ముగియడంతో సర్పంచులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పంచాయతీలకు రావాల్సిన రాష్ట్ర ఆర్థిక సంఘం (ఎస్ఎఫ్‌సీ) నిధులు గత ఐదు విడుతలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్నట్లుగా అధికారులు చెబుతున్నారు. దీంతో పంచాయతీలు నిధులు లేక నీరసించిపోతున్నాయి.చిన్నపాటి పనులు చేసేందుకు కూడా పలు జీపీల్లో పైసా లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ఏ విధంగా చేపట్టాలనే దానిపై కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ జేబుల నుంచి డబ్బులు పెట్టాల్సి వస్తే ప్రత్యేకాధికారులు తిరిగి తమకు చెల్లిస్తారా లేక కొర్రీల పేరిట ఇబ్బందులకు గురిచేస్తారా అనే దానిపై వారిలో గుబులు నెలకొంది. ఈ పరిస్థితుల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహణ ఎలా సాధ్యమంటూ ప్రత్యేకాధికారులు సైతం సందిగ్ధంలో ఉన్నారు.

వారికి కొత్త కొత్తగా ..

సర్పంచుల స్థానంలో పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, విద్యాశాఖతో పాటు ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఆర్‌ఐలు, ఎంపీవోలు వంటి పంచాయతీ పాలనతో ఎలాంటి సంబంధం లేని అధికారులను ప్రత్యేకాధికారులను నియమించారు. వీరంతా బాధ్యతలు స్వీకరించారు. అయితే పల్లె పాలనపై ఇప్పటి వరకు వీరికి ఎలాంటి అవగాహన లేకపోవడంతో అంతా కొత్తకొత్తగా అనిపిస్తుంది. మరోవైపు ఒక్కో అధికారికి నాలుగు, ఐదు పంచాయతీల బాధ్యతలు అదనంగా అప్పగించారు. జైనథ్ మండలంలో ఒకే ప్రత్యేకాధికారికి ఎనిమిది గ్రామపంచాయతీల బాధ్యతలు ఉండడం గమనార్హం. ఈ పరిస్థితుల్లో ప్రత్యేకాధికారులు కార్యక్రమ నిర్వహణకు ఏ మేరకు ముందుకొస్తారు, ఏ విధంగా నిధులు వెచ్చిస్తారనేది ప్రశ్నార్థకంగానే ఉంది. నిధుల అంశంపై కార్యదర్శులతో వారికి సమన్వయం కుదురుందా అనేది కూడా సందేహమే. సర్పంచ్‌లుంటే గ్రామస్తులను స్వచ్ఛందంగా భాగస్వాములను చేసేవారు. ఈ పరిస్థితుల నడుమ ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం ఏ విధంగా విజయమవుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

నాగోబా జాతరకు సన్నద్ధం

- మెస్రం వంశీయులు, భక్తులకు శాశ్వత, తాత్కాలిక మరుగుదొడ్లు
- ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్న జిల్లా అధికారులు



నాగోబా ఆలయం

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ నాగోబా జాతర సమీపించడంతో పనుల ఏర్పాట్లను అధికారులు ముమ్మరం చేశారు. నాగోబా పూజకు హాజరవుతున్న మెస్రం వంశీయులకు, జాతరకు వచ్చే భక్తులకు సరిపడా మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ దీపాల ఏర్పాటు, ఆర్టీసీ బస్టాండ్, వాహనాల పార్కింగ్, తైబజార్ నిర్వహనకు ప్లాట్ ఏర్పాటు పనులు ముమ్మరం చేశారు. పనులను కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ గౌస్ ఆలాం, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాలతో పాటు జిల్లా స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తూ గడువులోగా పూర్తి చేయించడానికి కృషి చేస్తున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో రూ.12లక్షలతో ఏర్పాట్లు..

ఫిబ్రవరి 9న మెస్రం వంశీయుల మహా పూజతో ప్రారంభం కానున్న నాగోబా జాతర ఏర్పాటు పనులను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ముమ్మరం చేశారు. సుమారు రూ.12లక్షల నిధులతో తాగునీటి సౌకర్యాలు కల్పించడంతో పాటు మరుగుదొడ్లు, స్నానపు గదులను, పశువుల తొట్టిలు ఏర్పాటు చేస్తున్నారు. మర్రిచెట్టు వద్ద తాత్కాలికంగా పది స్నానపు గదులు, శాశ్వతంగా పది మరుగుదొడ్లకు మరమ్మతులు చేశారు. పోలీస్ క్యాంప్ వద్ద, ఆర్టీసీ బస్టాండ్ వద్ద, దర్బార్ హాల్ వద్ద పది చొప్పున తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాట్లు చేశారు. అదే విధంగా నాగోబా సంప్రదాయ పూజలు ముగించే వరకూ మెస్రం వంశీయులు బస చేయనున్న గోవడ్ సమీపంలో ఇప్పటికే శ్వాశతంగా ఉన్న మరుగుదొడ్లను మరమ్మతులు చేయడంతో పాటు ఈసారి అదనంగా మరో 20శ్వాశత మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మాణం చేశారు. 10తాత్కాలిక స్నానపు గదులు ఏర్పాటు చేశారు. నాగోబా సంప్రదాయ పూజలకు వచ్చే మెస్రం వంశీయులకు, భక్తులకు ఎలాంటి లోటులేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు...

నాగోబా ఆలయ పరిసర ప్రాంతంతో పాటు మెస్రం వంశీయులు బస చేయనున్న మర్రి చెట్టు, గోవడ్ ప్రాంతంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు పూర్తి చేశారు. అదనపు కూలీలను ఏర్పాటు చేసి పారిశుధ్య పనులు చేయించారు. అదే విధంగా నాగోబా ఆలయ పరిసర ప్రాంతంతో పాటు మర్రిచెట్టు, గోవడ్ పరిసర ప్రాంతంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు.

దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి...

దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నాగోబా జాతర ఏర్పాటు పనులను పూర్తి చేశారు. నాగోబా ఆలయ ముస్తాబు, కోనేరు బావి శుభ్రత, గోవడ్, కోనేరు, ముఖద్వారం గేట్లు, గోడలకు రంగులు వంటి పనులు పూర్తిచేశారు. తైబజార్ స్థలం ఏర్పాటు, పార్కింగ్, ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు పనులను పూర్తి చేశారు. భక్తులకు, మెస్రం వంశీయులకు ఎలాంటి లోటులేకుండా ఏర్పాట్లు చేసినట్లు దేవాదాయ శాఖ ఈవో రాజమౌళి తెలిపారు.

రోడ్డు మరమ్మతులు పూర్తి..

ముత్నూర్ నుంచి కేస్లాపూర్ గ్రామం వరకూ ఉన్న డబుల్ రోడ్డు మరమ్మతు పనులను అధికారులు పూర్తి చేశారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలను మరమ్మతులు చేశారు. అదే విధంగా రోడ్డుకు ఇరువైపులా బ్లేడ్ ట్రాక్టర్ ద్వారా లేవలింగ్ చేయించి పిచ్చి మొక్కలు తొలగించారు.



మర్రిచెట్టు వద్ద తాత్కాలిక స్నానపు గదులు



ముస్తాబైన కోనేరు బావి



ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు



పశువుల నీటి తొట్టిలు

క్లుప్తంగా

సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టుకు ద్వితీయ స్థానం



జట్టుకు ట్రోఫీ అందిస్తున్న దృశ్యం

నేరడిగొండ: మెదక్ జిల్లాలో 9వ తెలంగాణ జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ బాలికల రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 3,4వ తేదీల్లో జరిగాయి. క్వార్టర్ ఫైనల్‌లో హైదరాబాద్ జట్టుతో 6–0తో గెలుపొంది సెమీ ఫైనల్‌కు చేరుకుంది. సెమీఫైనల్‌లో మెదక్‌తో 2–0తో గెలుపొంది ఫైనల్‌కు చేరుకుంది. ఫైనల్‌లో నిజామాబాద్ జట్టుతో తలపడి 0–8తో ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. ఈ పోటీలకు ముఖ్యఅతిథులు డీవైఎస్‌ఓ నాగరాజ్, ఇండియా సాఫ్ట్‌బాల్ జాయింట్ సెక్రటరీ శోభన్ బాబు, రాష్ట్ర సాఫ్ట్‌బాల్ ఉపాధ్యక్షుడు అభిషేక్ గౌడ్, రాష్ట్ర సాఫ్ట్‌బాల్ ప్రధాన కార్యదర్శి నవీన్, ఇండియా సాఫ్ట్ బాల్ కోచ్ చిన్నికృష్ణ పాల్గొని బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గోడం జ్యోతిరాం, జిల్లా ప్రధాన కార్యదర్శి గస్కంటి గంగాధర్, కోచ్ రవి. స్నేహ, వి.అఖిల, ఎన్‌ఐఎస్ కోచ్ పాల్గొన్నారు.

ఎల్లిగడ్డలు కిలోకు రూ.560



ఎల్లిగడ్డలు

కుంటాల: వెల్లుల్లి మానవ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. శరీరానికి కూడా అనేక ప్రయోజనాలను కలిగిస్తుంది. ప్రతినిత్యం వంటకాల్లో వెల్లుల్లి తప్పనిసరి. ఆదివారం కుంటాల వారసంతలో రూ.560కిలో చొప్పున వ్యాపారులు విక్రయించారు.

రిమ్స్‌లో మహిళ మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా హీరాపూర్ కొటారి గ్రామానికి చెందిన రాథోడ్ కవిత (36) చికిత్స పొందుతూ రిమ్స్ ఆస్పత్రిలో మృతిచెందినట్లు టూటౌన్ ఏఎస్సై ముకుంద్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గతేడాది 8 ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని పత్తి, కంది పంటలు వేశారు. దిగుబడి రాకపోవడంతో దిగాలు చెందిన ఆమె పంట చేనులో శనివారం సాయంత్రం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి మృతిచెందినట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

గుడిహత్నూర్: మండలంలోని జాతీయ రహదారి 44పై సీతాగోంది వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇచ్చోడ మండలం గేర్జం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కొప్పుల సుభాకర్ (47) మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. సుభాకర్ తన భార్య మమతతో కలిసి పని నిమిత్తం ఆదిలాబాద్ వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఇద్దరూ ఆటోలో వస్తుండగా శనివారం రాత్రి 11 గంటల సమయంలో సీతాగోంది గ్రామం వద్ద సుభాకర్ నడుపుతున్న ఆటోను వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో సుభాకర్, మమత తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. సుభాకర్ పరిస్థితి విషమిస్తుండడంతో హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కుమారుడు అభిలేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

క్రీడల్లో రాణిస్తే అన్ని రంగాల్లో సముచిత స్థానం



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

దిలావర్‌పూర్: క్రీడల్లో రాణిస్తే అన్నిరంగాల్లో సముచిత స్థానం లభిస్తుందని పెటా రాష్ట్ర బాధ్యుడు దయానంద్‌రెడ్డి అన్నారు. మండలంలోని న్యూలోలం గ్రామంలోని లిటిల్ స్కాలర్స్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జిల్లా స్థాయి సీనియర్ ఖోఖో జట్ల ఎంపిక కోసం ఆదివారం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని క్రీడాకారులను పరిచ యం చేసుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు. అనంతరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులకు పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన సీనియర్ బాల బాలికల జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన జట్లు ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు యదాద్రి భువనగిరి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా ఖోఖో అసోసియేషన్ పేర్కొంది. జిల్లా ఖోఖో అధ్యక్షుడు ఈశ్వర్, కార్యదర్శి ఎస్.శ్రీధర్‌రెడ్డి, లిటిల్ స్కాలర్స్ హైస్కూల్ ప్రిన్సిపాల్ బి.సురేశ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు రాష్ట్రపాల్, కృష్ణ, భీమన్న, రాంజీ, శంకర్ ఉన్నారు.

జిల్లా స్థాయి సీనియర్ బాలుర జట్టు ఇదే..

మండలంలోని న్యూలలోం గ్రామంలోని లిటిల్ స్కాలర్స్ ఉన్న పాఠశాలలో ఆదివారం జిల్లాస్థాయి సీనియర్ ఖోఖో జట్లను ఎంపిక చేశారు. సీనియర్ బాలుర జట్లులో రాజరెడ్డి, ఎన్.సాయికుమార్, ప్రణీత్, పృధ్వీ, పి.మధు, సీహెచ్ శ్రీను, ఏ.విజయ్‌కుమార్, ఏ.గణేష్, ఏ.సునీల్, ఎం.అంజన్న, టి.నరేశ్, జె.ప్రదీప్, పి.ప్రఫుల్, కె.చేతన్, ఎం.సాయిప్రసాద్, నిఖిల్, నవీన్‌కుమార్‌లను ఎంపిక చేశారు.

జిల్లా స్థాయి సీనియర్ బాలికల జట్టు ఇదే..

జిల్లా స్థాయి సీనియ్ ఖోఖో జట్టుకు ఎంపికైన బాలికల్లో ఎస్.సోని, యోగిత, పి.అంజలి, ఏ.సోని, కె.సత్యశీల, కె.నాగేశ్వరి, టి.నందిని, కె.దేవిక, జి.అక్షయ, జి.శ్రీనిధి, జి.గంగాసాగర, ఎం.స్వరూప, ఆర్.వైష్ణవి, ఆర్.అలేఖ్య, జి.సమీక్ష, డి.అశ్విత, బి.నవ్యశ్రీ, జి.సోని, డి.శ్రీజ ఎంపికయ్యారు.

నేడు ఇంద్రాదేవి చెంతకు మెస్రం వంశీయులు



ఇంద్రాదేవి ఆలయానికి వెళ్తున్న మహిళలు

ఇంద్రవెల్లి: పుష్యమాస అమవాస్యను పురష్కరించుకొని ఈ నెల 9న నిర్వహించే నాగోబా మహాపూజ కోసం తీసుకొస్తున్న గంగాజలం మెస్రం వంశీయులు తిరుగు ప్రయాణంలో మండలంలోని దోడంద గ్రామానికి గ్రామ పోలిమేరలో చెట్టుపై భద్రంగా ఉంచారు. ఆదివారం సాయంత్రం గంగాజలం తీసుకొని ఎడ్ల బండ్లతో ఇంద్రాదేవి ఆలయానికి బయల్దేరారు. సోమవారం ఉదయం ఆదివాసీల ఆరాధ్యదైవం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయానికి చేరనున్నారు. సాయంత్రం కేస్లాపూర్ గ్రామ సమీపంలోని మర్రిచెట్టు వద్ద మర్రిచెట్టు వద్ద మూడు రోజులు బస చేసి వారి సంప్రదాయ పూజలతో పాటు మెస్రం వంశంలో మరణించిన పెద్దల పేర్లతో తూమ్(ఖర్మకాండ) చేయనున్నారు. 9న గంగాజలంలో నాగోబా విగ్రహానికి, నాగోబా ఆలయానికి జలాభిషేకం చేసి మహాపూజ చేసి జాతర ప్రారంభించనున్నట్లు నాగో బా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు.

వర్గీకరణ సాధించే వరకూ మాదిగలు ఏకం కావాలి



మాట్లాడుతున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్/ఎదులాపురం: ఏబీసీడీ వర్గీకరణ సాధించేంతా వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మాదిగలంతా ఏకం కావాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కరదరపు ప్రవీణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న పిలుపు మేరకు, రాష్ట్ర కార్యదర్శి గజ్జల కాంతారావ్, జిల్లా అధ్యక్షుడు సుంకే రమేష్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎమ్మార్పీఎస్ మహిళా విభాగం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షురాలిగా పరిమళ మాదిగ, ప్రధాన కార్యదర్శి పుష్పలత, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా జయేందర్, పట్టణ అధ్యక్షుడిగా దర్శనాల గంగన్నలను నియమించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సీవోఈ సెట్

- దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు 5,918
- హాజరైనవారు 5,774 మంది

బెల్లంపల్లి: తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదివారం నిర్వహించిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ) కామన్ ఎంట్రెన్స్ టెస్ట్–2024 ప్రశాంతంగా జరిగింది. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో మొత్తం 5,918 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 5,774 మంది హాజరుకాగా 144 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 97.55 శాతం నమోదైనట్లు ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజియన్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి ప్రకటించారు. సీవోఈ సెట్ నిర్వహణ కోసం ఆదిలాబాద్ రీజియన్‌లో మొత్తం 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఆదిలాబాద్ జిల్లాలో నాలుగు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో నాలుగు, మంచిర్యాల జిల్లాలో ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జంబ్లింగ్ పద్ధతిలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడంతో సుదూర ప్రాంతాల విద్యార్థులు తల్లిదండ్రులు, తోబుట్టువులతో కలిసి పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులు సామూహికంగా రావడంతో పరీక్ష కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. నిర్దేశించిన సమయానికి గంట ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాల ప్రధాన ద్వారం ఎదుట ఏర్పాటు చేసిన నోటీసు బోర్డుపై అంటించిన హాల్‌టికెట్ నంబర్లను సరిచూసుకుని విద్యార్థులు పరీక్ష హాల్‌లోకి వెళ్లారు. పరీక్ష కేంద్రంలో ముందుగా విద్యార్థులకు ఓఎంఆర్ షీట్‌పై బబ్లింగ్ చేసే విధానం గురించి అవగాహన కల్పించారు. ఆ తర్వాత ఉదయం 10 గంటలకు ప్రారంభం కాగా మధ్యాహ్నం ఒంటిగంటకు ముగిసింది.



బెల్లంపల్లి సీవోఈ కళాశాల పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న ఆర్సీవో స్వరూపారాణి

సౌకర్యాల కల్పన

పరీక్షకు హాజరైన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేశారు. సెంటర్లలో తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ ఏర్పాటు చేశారు. పరీక్ష సజావుగా సాగడానికి కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు, తోబుట్టువులు చెట్లకింద, వాహనాల్లో సేద తీరారు.

కేంద్రాలను పర్యవేక్షించిన ఆర్సీవో

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ప్రవేశ పరీక్ష కేంద్రాలను సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజియన్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి పర్యవేక్షించారు. బెల్లంపల్లిలో ఏర్పాటు చేసిన సీవోఈ బాలుర కళాశాల, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల, కాసిపేట సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల కేంద్రాలను సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం, ఫస్ట్ ఎయిడ్ సెంటర్, హెల్ప్‌డెస్క్‌ల వివరాలు తెలుసుకుని చీఫ్ సూపరింటెండెంట్లు ఐనాల సైదులు, స్వరూప, సంతోష్‌కుమార్, సిబ్బందిని ఆర్సీవో ప్రత్యేకంగా అభినందించారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలు

పరీక్ష కేంద్రం	విద్యార్థుల సంఖ్య	హాజరైన వారు
ఆదిలాబాద్ (సీవోఈ బాలికలు)	648	639
బోథ్ (బాలికలు)	648	634
ఇచ్చోడ(బాలురు)	255	246
ఆదిలాబాద్ డిగ్రీ కళాశాల(బాలికలు)	172	165
ఆసిఫాబాద్ (బాలురు)	528	519
సిర్పూర్‌టీ (బాలురు)	347	338
సిర్పూర్‌టీ(బాలికలు)	347	338
రెబ్బెన(బాలికలు)	273	266
బెల్లంపల్లి(సీవోఈ,బాలురు)	504	490
బెల్లంపల్లి(బాలికలు)	480	472
కాసిపేట(బాలురు)	401	390
లక్సెట్టిపేట(బాలికలు)	480	467
చెన్నూర్ (బాలికలు)	550	531
జైపూర్(బాలురు)	285	279

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



కిరణ్ (ఫైల్)

తానూరు: మండల కేంద్రానికి చెందిన బోనాల సాయినాథ్ (22) శనివారం సాయంత్రం తన వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... బోనాల సాయినాథ్ కొన్ని నెలలుగా మద్యానికి అలవాటుపడ్డాడు. శనివారం సాయంత్రం 5గంటల ప్రాంతంలో ఇంటి నుంచి వెళ్లిపోయి రాత్రి వరకూ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతడి కోసం వ్యవసాయ పొలానికి వెళ్లి చూడగా చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. ఆదివారం పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. తండ్రి పోతన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ వెల్లడించారు.

పురుగుల మందు తాగి బాలుడు..

నిర్మల్: పురుగుల మందు తాగి బాలుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దస్తురాబాద్ మండలంలోని మున్యాల తండా గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రభాకర్‌రెడ్డి వివరాల ప్రకారం ... నాగవత్ కిరణ్(14) గురువారం తండ్రి శ్రీనివాస్ మందలించడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో చేనులో క్రిమి సంహారక పురుగుల మందు తాగి పడిపోయాడు. అటుగా వెళ్లిన గొర్రెల కాపరి చూసి కుటుంబ సభ్యులకు తెలుపడంతో వెంటనే ఖానాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైనా చికిత్స కోసం నిర్మల్ తరలించగా పరిస్థితి విషమించడంతో కరీంనగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. బాలుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చదువులమ్మ ఒడిలో..

- రెండు దశాబ్దాల తర్వాత కలిసిన గురువులు
- మధుర స్మృతులను నెమరేసుకున్న వైనం
- డైట్ కళాశాలలో అ'పూర్వ' సమ్మేళనం



ఒకేచోట చేరిన పూర్వ ఛాత్రోపాధ్యాయులు

ఆదిలాబాద్‌టౌన్: వారంతా ఒకప్పటి ఛాత్రోపాధ్యాయులు.. ప్రస్తుతం వారందరూ ఎంతోమందికి విద్యాబుద్ధులు నేర్పుతూ వారి భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో వృత్తిరీత్యా బిజీగా ఉంటూ కాలం గడుపుతున్నారు. వారు ఉపాధ్యాయ శిక్షణ పొందిన దేవాలయంలో కలవాలని నిర్ణయించుకున్నారు. నెల రోజులుగా మిత్రులందరు వాట్సాప్ గ్రూప్‌గా ఏర్పడ్డారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాల వారికి వేదికగా నిలిచింది. రెండు దశాబ్దాల తర్వాత కలిసిన వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. మధురస్మృతులను నెమరేసుకున్నారు. 2004–06 బ్యాచ్‌కు చెందిన ఛాత్రోపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనానికి జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల వేదికగా మారింది. 85 మంది ఛాత్రోపాధ్యాయులు ఉండగా, 75మంది ఉపాధ్యాయులు కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండతో పాటు జిల్లాకు చెందిన వారు హాజరయ్యారు. మిత్రులను ఒకేచోట చేర్చేందుకు ఉపాధ్యాయులైన తోటి మిత్రులు శివకుమార్, గడుగు నరేందర్, కిరణ్ కుమార్, ఉష్కం తిరుపతి, మల్లేష్, గజానంద్, వెంకటేష్‌లు ఎంతగానో శ్రమించారు. వీరికి శిక్షణ కల్పించిన గురువులు పాపాలాల్, శివకుమార్, అశోక్, జ్యోతివైద్య, ముందయ్య, శంకర్, నీలకంఠ, జలేందర్ రెడ్డి లను సన్మానించారు.

ప్రధాన 'కూడలి కట్టడి'తో ఇబ్బందులు

నిర్మల్ జిల్లా కేంద్రంలో ప్రధాన కూడలైన కొండా లక్ష్మణ్ బాపూజీ చౌక్‌లో పాత కలెక్టరేట్, మున్సిపల్, జిల్లా కోర్టుకు ప్రధాన మార్గమైన కూడలి వద్ద పోలీసులు ఆంక్షలు విధించి దారిని బారిగేట్లతో మూసేయడంతో ఈ మార్గం గుండా వెళ్లే వారికి అవస్థలు తప్పడం లేదు. ఇంద్రనగర్ నుంచి కూరగాయల మార్కెట్, ఆర్డీవో కార్యాలయంతో పాటు మున్సిపల్ కార్యాలయం, జిల్లా కోర్టు, ఫైర్‌స్టేషన్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయాలతో పాటు షార్ట్‌కట్‌లో ఈద్గాం చౌరస్తాకు వెళ్లే వాహనదారులతో పాటు పాదాచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో అధికారుల తీరుపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



డివైడర్ పైనుంచి వెళ్తున్న మున్సిపల్ సిబ్బంది



కూరగాయల మార్కెట్ వద్ద



మున్సిపల్ కార్యాలయం వద్ద



ఇబ్బంది పడుతూ రోడ్డు దాటుతున్న వృద్ధుడు

క్లుప్తంగా

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్


ట్రోఫీ అందుకుంటున్న అంతర్గాం జట్టు సభ్యులు

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామానికి చెందిన యువకులు గొల్లి వైభవ్, షేక్ సల్మాన్‌ల స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. గత 15 రోజులుగా కొనసాగుతున్న టోర్నమెంట్‌లో వివిధ జట్లు పాల్గొనగా, ఆదివారం ఫైనల్ మ్యాచ్‌లో అంతర్గాం, ఇందూర్‌పల్లి జట్లు తలపడ్డాయి. అంతర్గాం జట్టు 102 పరుగులు సాధించి విజయం సాధించింది. విజేత జట్టుకు రూ.25వేలు, ద్వితీయస్థానంలో నిలిచిన ఇందూర్‌పల్లి జట్టుకు రూ.12 వేలు, తృతీయ స్థానంలో అర్లి(టి) జట్టుకు రూ.7వేలు, నాలుగవ స్థానంలో పిప్పల్‌కోటి జట్టుకు రూ.5వేల నగదుతోపాటు ట్రోఫీలను నిర్వాహకులు అందజేశారు. నిర్వాహకులు టేకం దిలీప్, సురేష్, సాగర్, సాయికృష్ణ, విశాల్, సందీప్ ఫిరోజ్, ఇర్ఫాన్ ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


కార్యవర్గ సభ్యులు

బోథ్: మండలంలోని కనుగుట్ట వీడీసీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నవ్వ రవి, ఉపాధ్యక్షుడిగా శంషొద్దీన్, సభ్యులుగా కుమ్మరి రమణ, మునిగెల రమేశ్, అన్నెపాక అశోక్, కైపెల్లి రాజు, నల్ల చిన్నయ్య, రాజు, బోడ గంగయ్య, గడ్డల నారాయణ, బొడ్డు పోశెట్టి ఎన్నికయ్యారు. కాగా, గ్రామాభివృద్ధికి తోడ్పడతామని వారు పేర్కొన్నారు.

బజార్‌హత్నూర్: మండలంలోని జాతర్ల గ్రామంలో ప్రధాన్ సమాజ్ నూతన మండల కార్యవర్గాన్ని జిల్లా ఉపాధ్యక్షుడు ఉయికే సుదర్శన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుర్సెంగే దేవిదాస్, కార్యనిర్వహక అధ్యక్షుడిగా సిడం జంగు, ఉపాధ్యక్షులుగా సిడం ఉత్తం, ఉయికే సుధాం, మేస్రం నాందేవ్, ప్రధాన కార్యదర్శిగా ఆత్రం గోపాల్, సహాయ కార్యదర్శిగా గెడం దేసవిదాస్, సంయుక్త కార్యదర్శిగా మడవి నరహరి, సాంస్కృతిక కార్యదర్శిగా సలాం అంకుశ్, ప్రచార కార్యదర్శిగా సిడం మారుతి, కోశాధికారిగా మేస్రం నగేశ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నైతం రమేశ్, వడ్డి ఉత్తం పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

జైనథ్: మండల కేంద్రానికి చెందిన బోరి పవన్ ఇటీవల బ్రెయిన్ ట్యూమర్‌కు గురై చికిత్స పొందాడు. మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సాయం అందించారు. మాల సామాజికవర్గానికి చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులు సాయంగా రూ.31 వేల అందజేశారు. నాయకులు అల్లూరి భూమన్న, హర్ష, దేవిదాస్, యాసంత, నారాయణ, ప్రభుదాసు, శశికాంత్, కుమ్మరి, సత్యనారాయణ, బ్రహ్మ శ్రీనివాస్, ప్రభాకర్, క్రాంతి, ప్రశాంత్, సాయిబాబా, రాహుల్, కిరణ , హర్ష, రమేశ్ పాల్గొన్నారు.

ముగిసిన పూసాయి ఎల్లమ్మ జాతర


పూజలు చేస్తున్న భక్తులు

జైనథ్: మండలంలోని పూసాయిలో వెలిసిన రేణుక ఎల్లమ్మ జాతర ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా భక్తులు తరలివచ్చి ఆలయంలో పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం పిండి వంటలు, మాంసం వండుకొని భోజనాలు చేశారు.

అన్నదానం


అన్నదానం చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణానికి వచ్చే పేద ప్రజల ఆకలిని తీర్చేందుకు సంగెం ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగుతోంది. ఈ ఆదివారంతో 150వ వారానికి చేరింది. ఈ సందర్భంగా ఆ ట్రస్ట్ సభ్యులు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి పేదలకు భోజనాన్ని వడ్డించారు. సభ్యులు సుధీర్‌కుమార్, సలీమ్, సుభాష్, రాజయ్య, శేఖర్, లఖన్ పాల్గొన్నారు.

వేధిస్తున్న టీచర్ల కొరత

- భర్తీ కాని ఉపాధ్యాయ పోస్టులు
- విద్యార్థులు తప్పని తిప్పలు


అంతర్గాం ప్రాథమికోన్నత పాఠశాల

తాంసి: భీంపూర్ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. రెండేళ్లుగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకపోవడంతో బడుల్లో విద్యాబోధన కుంటుపడుతోంది. భీంపూర్ మండలంలోని అంతర్గాం, వడూర్ గ్రామాల ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంది. వీరికి సరిపడా ఉపాధ్యాయులు లేరు. జిల్లా విద్యాశాఖ అధికారులు టీచర్లను డిప్యూటేషన్‌పై పాఠశాలలకు పంపుతున్నా వెళ్లడం లేదు. మారుమూల ప్రాంతం కావడంతో ఇక్కడికి రావడానికి ఆసక్తి లేదు. దీంతో విద్యార్థులకు బోధన చెప్పేందుకు ఇతర ఉపాధ్యాయులపై అదనపు భారం పడుతోంది.

అంతరాం, వడూర్‌లో సరిపడా లేని టీచర్లు

భీంపూర్ మండలం అంతర్గాం పాఠశాలలో 81 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లు ఉన్నారు. వడూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో 90 మంది విద్యార్థులకుగాను ముగ్గురు టీచర్లే ఉండడం గమనార్హం. దీంతో నాణ్యమైన విద్య అందక విద్యార్థులు నష్టపోవల్సి వస్తుంది. పిప్పల్‌కోటి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై ఉన్నతాధికారులు పంపిన ఈ పాఠశాలలకు నియమించలేదు. ఈ విషయమై విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు డీఈవో, ఎంఈవోకు విన్నవించారు. అయినా ఎలాంటి ఫలితం లేకపోయింది. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

చర్యలు చేపట్టాలి



ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదు. ప్రభుత్వ బడులపై నమ్మకంతో విద్యార్థులను చేర్పిస్తున్నాం. అధికారులు టీచర్లను ఇక్కడకు పంపేలా చర్యలు చేపట్టాలి.
– జజ్జరి రాకేశ్‌యాదవ్, అంతర్గాం

కాంగ్రెస్‌లోకి వెళ్లేది లేదు

- ఎమ్మెల్యే అనిల్ జాదవ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్: బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలుపొందిన తాను కాంగ్రెస్‌లోకి వెళ్లేదే లేదని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్పష్టం చేశారు. మండలంలోని పొచ్చెర జలపాతం వద్ద ఆదివారం మాజీ సర్పంచుల వీడ్కోలు సమావేశానికి ఆయన హాజరయ్యారు. మండలంలోని 33 పంచాయతీ సర్పంచులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సర్పంచుల పరిస్థితి తనకు తెలుసునని అన్నారు. తమ పదవీకాలం ముగిసినా ప్రజలకు అందుబాటులో ఉండి సేవచేయాలన్నారు. ప్రభుత్వం అధికారంలో ఉందని కాంగ్రెస్‌లో చేరితే ఎలాంటి ప్రయోజనం ఉండదని అన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ లీగ్ విజేత ఎస్ఎస్‌యూఐ

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామంలో జరిగిన క్రికెట్ టోర్నీలో మండల కేంద్రానికి చెందిన ఎస్ఎస్‌యూఐ జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్‌లో ఎస్ఎస్‌యూఐ. కౌఠ(బి) జట్లు తలపడ్డాయి. విజేతలకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బహుమతులు అందజేశారు. ఎస్ఎస్‌యూఐ జట్టుకు ప్రథమ బహుమతి రూ.20 వేలు, రన్నరప్‌గా నిలిచిన కౌఠ(బి) జట్టుకు రూ.10 వేల బహుమతిని అందించారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా యండీ జాఫర్, బెస్ట్ బౌలింగ్‌గా సబ్బని సాయి అందుకున్నారు.

మగ్దుం మొహియుద్దీన్ జయంతి


నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు మగ్దుం మొహియుద్దీన్ 116వ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. కవిగా, ఉపాధ్యాయుడిగా, ప్రజల పక్షాన పోరాడిన యోధుడు మగ్దుం అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని అన్నారు. నాయకులు మధుసూదన్, నర్సింగ్, అరుణ్, శ్రీనివాస్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కోదండరాంను కలిసిన ఉద్యమకారులు


శుభాకాంక్షలు తెలుపుతున్న శంకర్ దంపతులు

బోథ్: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన ప్రొఫెసర్ కోదండరాంను తెలంగాణ ఉద్యమకారులు రావుల శంకర్, జ్యోత్స్న దంపతులు ఆదివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. స్వీట్లు తినిపించారు.

క్రీడాస్ఫూర్తి చాటడం అభినందనీయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటడం అభినందనీయమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని చిన్నబుగ్గారం గ్రామంలో గతనెల రోజులుగా జరిగిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విజేత జట్లకు ట్రోఫీతోపాటు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసంతోపాటు స్నేహభావం పెంపొందుతుందన్నారు. యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఎంపీపీ రాథోడ్ సజన్, ప్రజాప్రతినిధులు, నాయకులు, అనిల్ అన్న యువ సైన్యం సభ్యులు పాల్గొన్నారు.

సర్పంచుల సేవలు అభినందనీయం


సన్మానిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్


బోథ్: సన్మానగ్రహీతలతో గ్రామస్తులు

తాంసి: సర్పంచుల పదవీ కాలంలో గ్రామాల అభివృద్ధికి అందించిన సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. తలమడుగు మండలంలోని బరంపూర్ రైతువేదికలో మండల సర్పంచుల ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సన్మానం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామాల సర్పంచులను మాజీ ఎంపీ నగేశ్‌తో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్పంచులుగా గ్రామాల్లో సమస్యల పరిష్కారం నిరంతరం కృషి చేశారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మండల సర్పంచ్‌లు తన గెలుపు కోసం కృషి చేశారని గుర్తుచేశారు. పదవీకాలం ముగిసిన ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండాలని కోరారు.గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామపెద్ద కేదారేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి కిరణ్, మండల కన్వీనర్ వెంకటేశ్, నాయకులు ప్రకాశ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, కరుణాకర్‌రెడ్డి, మహేందర్ యాదవ్ పాల్గొన్నారు.


సర్పంచ్ సావిందర్‌ను సన్మానిస్తున్న సభ్యులు

బోథ్: మండలంలోని కౌఠ(బి) పంచాయతీ మాజీ పాలకవర్గానికి గ్రామస్తులు ఆదివారం సన్మానించారు. మాజీ సర్పంచ్ కొంకటి రాధిక, మాజీ ఉప సర్పంచ్ రవిందర్, మాజీ వార్డు సభ్యులను శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

నార్నూర్: మాన్కాపూర్ సర్పంచ్ రాథోడ్ సావిందర్‌ను స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. సర్పంచ్ దంపతులకు శాలువా కప్పి సత్కరించారు. ఐకేపీ సిబ్బంది రాథోడ్ శారద, స్వయం సహాయక సంఘాలు, వీవో సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నేరడిగొండ: కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని కొలిమికుంట గ్రామంలో టీపీసీసీ జనరల్ సెక్రెటరీ సత్తు మల్లేశ్ తండ్రి ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు ఆడే గజేందర్ ఆదివారం వారి నివాసానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బోథ్ నియోజకవర్గ బ్లాక్ అధ్యక్షుడు ప్రఫుల్ చందర్ రెడ్డి, నేరడిగొండ మండల అధ్యక్షుడు ఆడే వసంత్ రావు, అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు పోతారెడ్డి, కాంగ్రెస్ నాయకులు కపిల్, మౌలానా పాల్గొన్నారు.

కుక్కకాటుతో ఎద్దు మృతి

తాంసి: మండల కేంద్రానికి చెందిన కమ్మరి ప్రకాష్ అనే రైతు ఎద్దు ఆదివారం కుక్కకాటుతో గాయపడి మృతి చెందింది. ఎద్దును కుక్క కాటువేయడంతో వ్యాధి సోకి మృతి చెందినట్లు మండల పశువైద్యాధికారి శ్రీకాంత్ ధృవీకరించారు. దీంతో రూ.50వేల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం తరఫున సాయం అందించి ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

'ఓర్వలేకనే ఆరోపణలు'

ఎదులాపురం: ఇంద్రవెల్లిలో నిర్వహించిన తెలంగాణ పునర్నిర్మాణ సభ విజయవంతం, పార్టీకి లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా నాయకుడు రషీద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇలాంటి ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. షకీల్, నూర్‌ఖాన్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో రిటైర్డ్ ఆర్ఐ మృతి


రాజేశ్వర్ (ఫైల్)

నేరడిగొండ: మండలంలోని కుమారి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్ఐ ఓర్స రాజేశ్వర్ (68) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. ఆయన గత కొన్నిరోజులుగా అనారోగ్యం బారిన పడ్డారు. ఇచ్చోడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. అంత్యక్రియలను సోమవారం ఆయన స్వగ్రామం కుమారిలో జరగనున్నాయి. కాగా ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలియజేశారు.

సోషల్ మీడియా కన్వీనర్‌గా స్వప్న


స్వప్నను సన్మానిస్తున్న మహిళా మోర్చా సభ్యులు

ఆదిలాబాద్: బీజేపీ జిల్లా మహిళా మోర్చా సోషల్ మీడియా కన్వీనర్‌గా స్వప్న నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వెల్లడించారు. అనంతరం కన్వీనర్‌ను మహిళా మోర్చా సభ్యులు సన్మానించారు.

యువత క్రీడల్లో రాణించాలి


కికెట్ పోటీలు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

తాంసి: యువత క్రీడల్లో రాణించాలని తలమడుగు జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని దేగామ గ్రామంలో జూనియర్ యువసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలను జెడ్పీటీసీ యువకులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరుస్తూ ముందుకెళ్లాలని కోరారు. జూనియర్ యువసేన అధ్యక్షుడు దిలీప్, కార్యదర్శి శంకర్, కాంగ్రెస్ నాయకులు వెంకన్న, సుభాష్, రఫీక్, అనిల్ తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో పూజలు


పూజలు చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

బేల: మండలంలోని సదల్‌పూర్ శివారులోని బైరందేవ్, మహాదేవ్ ఆలయాల పరిసరాల్లో కొనసాగుతున్న జంగీ జాతరలో రెండోరోజు ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో బారులు తీరారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. రంగుల రాట్నాలు, ఇతరత్రవి చిన్నారులు, యువత ఆటపాటలు కేరింతలతో సందడిగా మారాయి. యువతులు, మహిళలతో దుకాణాల్లో కిక్కిరిశాయి. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వంటావార్పు చేసుకున్నారు.

యూత్‌నాయకుల పూజలు

ఆలయాల్లో యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సామ రూపేశ్‌రెడ్డి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గావుండే ఘణేశ్యాం, నాయకులు అవినాష్, విపిన్, బొక్రే శంకర్, సుధాకర్, నయన్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంపై తప్పుడు ప్రచారం మానుకోవాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు

ఉట్నూర్‌రూరల్: సీఎం రేవంత్‌రెడ్డి తొలిసారిగా ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో పర్యటిస్తే బీఆర్ఎస్ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. ఉట్నూర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాగోబా ఆలయ అభివృద్ధి కోసం రూ.7 కోట్లు మంజూరు, కడెం ప్రాజెక్టు మరమ్మతుకు నిధులను సీఎం కేటాయించారని పేర్కొన్నారు. సీఎం ఎన్నో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తే మాజీ మంత్రి జోగు రామన్న, బీఆర్ఎస్ నేత జాన్సన్ నాయక్‌తో పాటు కొందరు నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇంద్రవెల్లి స్మృతివనానికి శంకుస్థాపన చేస్తే కొందరు నాయకులు సీఎం చెప్పులతో వచ్చారని శుద్ధిచేసే కార్యక్రమాన్ని చేపట్టడాన్ని ఖండించారు. మండల అధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యూం, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు ఎక్బాల్, కడెం మండల అధ్యక్షుడు తుమ్మల మల్లేశ్ యాదవ్, దస్తురాబాద్ మండల అధ్యక్షుడు దుర్గం మల్లేశ్, కాంగ్రెస్ నాయకులు గోవర్ధన రెడ్డి, కన్నాపూర్ మాజీసర్పంచ్ రఘురాం పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంతలు



బేల: మండలంలో ఆర్అండ్‌బీ శాఖ పరిధిలోని సైద్‌పూర్ రెవెన్యూ గ్రామ శివారులోని బ్రిడ్జి (సాత్నాల–లోకారి డబుల్ రోడ్డు మార్గం)పై గుంతలు ప్రమాదకరంగా మారాయి. దీంతో ద్విచక్రవాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వృథాగా స్తంభాలు



బేల: మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలోని త్రిఫేజ్ విద్యుత్ సరఫరా కోసం తెచ్చిన స్తంభాలు మశాల(కె) శివారులోని మూల మలుపు వద్ద వృథాగా దర్శనమిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ లైన్ పనులు ప్రారంభం కాలేదు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బాబోయ్ కుక్కలు



బేల: మండల కేంద్రంలోని మార్కెట్ కూడలిలోని జాతీయ రహదారిపై వీధి కుక్కలు సంచరిస్తున్నాయి. దీంతో ప్రజలు, ద్విచక్రవాహనదారులకు ప్రయాణ ప్రమాదకరంగా మారుతోంది. ఒక్కోసారి పడిపోయి, గాయాలపాలవుతున్నారు.

కనక దుర్గాదేవి ఆలయంలో భక్తుల సందడి


అన్నదానం చేస్తున్న దేవార వినోద్

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనక దుర్గాదేవీ, మహంకాళి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పక్క మండలాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి పూజలో భాగంగా ఓడి బియ్యం, పట్టువస్త్రాలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మొక్కులో భాగంగా పలువురు భక్తులు తమ పిల్లల తలనీలాలు అమ్మవారికి సమర్పించారు. ప్రధాన అర్చకుడు దేవార వినోద్ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.